సాక్షి

శ్రీకాకుళం

బుధవారం । 11 । జనవరి । 2023



జెడ్పీ అంచనా బడ్జెట్..

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1877 కోట్లుగా ప్రతిపాదించారు. జెడ్పీలో దీనిపై సమావేశం జరిగింది.

- IIలో



నిజాయితీగా పనిచేస్తుంటే..

తనపై వచ్చిన ఆరోపణలను మంత్రి ధర్మాన ఖండించారు. నిజాయితీగా పనిచేస్తే తప్పుగా రాస్తున్నారని మండిపడ్డారు.

- IIలో

కాలేజీలు తెరిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవు రోజుల్లో జూనియర్ కళాశాలలు తెరిచినా, ప్రత్యేక తరగతులను నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటి నాయుడు తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్సులను అందిస్తున్న అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలలకు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించిన విషయం తెలిసిందే.

న్యూస్‌రీల్

అగ్గిమంటలో పడి చిన్నారికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం పంచాయతీ సవర బాణాపురం గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక అగ్గిమంటలో పడి గాయాలపాలైంది. ఉమశ్రీ అనే బాలిక మంగళవారం సాయంత్రం గ్రామంలో చలిమంటల దగ్గరకు వెళ్లింది. చలి కాగుతూ ఉన్నట్టుండి మంటల్లో పడిపోయింది. అక్కడున్న వారు వెంటనే బాలికను బయటకు తీశారు. అప్పటికే చిన్నారి ఒంటి నిండా గాయాలయ్యాయి. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్లాస్టిక్ సర్జరీ అవసరమని డాక్టర్లు చెప్పారని బాలిక తల్లిదండ్రులు సునీత, మోహన్ తెలిపారు.

నేడు జగనన్న తోడు రుణాల పంపిణీ



శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న తోడు రుణాల పంపిణీ, లబ్ధిదారులకు వడ్డీ జమ కార్యక్రమం బుధవారం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 14,091 మందికి, పట్టణ ప్రాంతాల్లో 2185 మందికి గాను మొత్తం 16,276 మంది లబ్ధిదారులకు రూ.16.27 కోట్లు రుణాల రూపంలో, గతంలో జగనన్న తోడు తీసుకున్న లబ్ధిదారులకు చెల్లించాల్సిన వడ్డీ 27,521 మందికి గాను రూ.58.04 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ విడతలో కొత్తగా జగనన్న తోడు రుణాలు, వడ్డీ కలిపి 17,643 మంది లబ్ధిదారులకు గాను రూ.16.85 కోట్లు అందజేయనున్నారు.

చంద్రబాబు ఉద్దానంకు ఏం చేశాడు..?

కాశీబుగ్గ: ఉద్దానం ప్రాంతానికి చంద్రబాబు ఏమైనా చేశాడా..? అని ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సూటిగా ప్రశ్నించారు. మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకున్నారు తప్ప కిడ్నీ వ్యాధి బాధితులను పట్టించుకోలేదని విమర్శించారు. ఆమె మంగళవారం పలాసలో మంత్రి అప్పలరాజు, ఇతర అధికారులతో పర్యటించాక మీడియాతో మాట్లాడారు. మంచి చేయకపోవడంతో పాటు మంచి చేసినవారిపై బురద జల్లడం బాబు నైజమని అన్నారు. అవసరం ఉన్నచోట అరకొర సేవలతో ఓట్లు అడగడానికి మాత్రమే వస్తాడని దుయ్యబట్టారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నడుపుతున్నది యువశక్తి కాదని నారా శక్తి అని ఎద్దేవా చేశారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ఉద్దానంలో మరిన్ని పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని కోరారు. మందస మండలం భేతాళపురం, రట్టి, వజ్రపుకొత్తూరు ఉద్దానంలో సైతం ఏర్పాటు చేస్తే కిడ్నీ రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పలాస, ఇచ్ఛాపురం, సోంపేటలో కనీసం ఇద్దరు రేడియాలజిస్టులను నియమించాలని,రూ.700 కోట్ల వాటర్ గ్రిడ్‌కు మున్సిపాలిటీ ఏఐఐబీ స్కీమ్‌ను అనుసంధానించాలని కోరారు.



బుడగట్లపాలెం

సిక్కోలు తీరానికి రేవుల హారం

- మత్స్యకారుల బతుకులు మార్చేందుకు ద్విముఖ వ్యూహం
- గంగపుత్రుల ఆదాయం పెంపుతో పాటు వలసల నియంత్రణకు సంక్షేమాల అమలు
- మూలపేటలో రూ.3200కోట్లతో భావనపాడు పోర్టుకు లైన్ క్లియర్
- రూ.365కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్
- త్వరలోనే రెండింటికీ శంకుస్థాపన

అటు నీళ్లు.. ఇటు కన్నీళ్లు.. దశాబ్దాలుగా సిక్కోలు మత్స్యకారుల బతుకు చిత్రమిది. కంటి ముందు అనంతమైన సముద్ర సంపద ఉన్నా పొట్ట చేత పట్టుకుని పారాదీప్ నుంచి వీరావల్ వరకు వలస వెళ్లేవారు. ఉన్న చోట బతుకు లేక, కుటుంబంతో బతకలేక కాసింత అదనపు సంపాదన కోసం అయిన వారందరినీ వదిలి ఎక్కడో అజ్ఞాతవాసం చేసేవారు. పండక్కో పబ్బానికో ఇంటికి వచ్చి కన్నవారిని, కట్టుకున్న వారిని చూసుకునేవారు. పొరపాటున అక్కడేదైనా జరిగితే ఆఖరి చూపు కూడా ఉండదు. జిల్లాలో ఒక్క పోర్టు ఉన్నా, ఒక్క ఫిషింగ్ జెట్టీ నిర్మించి ఉన్నా ఇలాంటి యాతన ఉండేది కాదు. ఇంతకాలానికి సిక్కోలు తీరానికి మణిహారంలా ఓ పోర్టు రాబోతోంది. ఇన్నాళ్లకు గంగపుత్రుల బెంగ తీరేలా జెట్టీలు కట్టబోతున్నారు. ఈ ఆలోచన వెనుక ఉన్న పేరు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. కడలి బిడ్డల బతుకులు మార్చేందుకు ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

దశాబ్దాలుగా ఉపన్యాసాలు మాత్రమే వింటున్న సిక్కోలు మత్స్యకారులకు ఇప్పుడు పని కనిపిస్తోంది. హామీలు మాత్రమే తెలిసిన గంగపుత్రులకు నాయకుడి పనితనం అర్థమవుతోంది. భావనపాడు పోర్టు, మంచినీళ్ల పేటలో ఫిషింగ్ జెట్టీ, జిల్లాలో ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టులు ఇన్నాళ్లూ హామీలుగానే ఉండేవి. సీఎం వైఎస్ జగన్ చొరవతో వీటి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఇవి పూర్తయితే మన గంగపుత్రులు వలస వెళ్లి బతకాల్సిన అగత్యం ఇక ఉండదు.

జాతీయ స్థాయిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్యం మెరైన్ సెక్టార్ నుంచే వస్తోంది. అందులో సిక్కోలు మత్స్యకారుల వాటా ఎక్కువే. కానీ మౌలిక వసతులు లేకపోవడంతో 193 కిలోమీటర్ల తీర ప్రాంతం అభివృద్ధి చెందలేదు. జిల్లాలో 11 మండలాల పరిధిలో 145మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. స్థానికంగా వేటకు అనుకూలత లేక పొట్ట చేత పట్టుకుని వేరే రాష్ట్రాలకు వలసపోతున్నారు. ఈ పరిస్థితి లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. జెట్టీలు, ఫిషింగ్ హార్బర్, పోర్టు నిర్మాణంతో మత్స్యకారుల బతుకుల్లో సరికొత్త వెలుగులు తీసుకురావాలని భావిస్తోంది.



మంచినీళ్లపేటలో జరుగుతున్న జెట్టీ నిర్మాణ పనులు

మంచినీళ్లపేట జెట్టీకి శ్రీకారం..

అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార సమస్యలతో పాటు వలసలపై ప్రత్యేక దృష్టిసారించారు. అందులో భాగంగా స్థానికంగా వనరులు, ఉపాధి పరిస్థితులు సమకూర్చాలని ప్రణాళిక రూపొందించారు. దానిలో భాగంగానే వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేటలో రూ.11.95కోట్లతో జెట్టీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఫిషింగ్ హార్బర్లు కూడా నిర్మిస్తుండగా.. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో కూడా రూ. 365కోట్లతో హార్బర్ నిర్మించనున్నారు. దీని కోసం 42 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. మరికొంత భూమిని కూడా సేకరిస్తోంది. త్వరలోనే దీనికి కూడా శంకుస్థాపన చేయనుంది.

పోర్టుకు ఫుల్ సపోర్టు



జిల్లా ప్రజల దశాబ్దాల కల భావనపాడు పోర్టు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. పోర్టుకు అవసరమైన భూములను మూలపేట గ్రామంలో ఎకరాకు రూ. 25లక్షలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. వాటి ద్వారా నిర్వాసితులకు ప్రత్యేకంగా పునరావాస కాలనీ కోసం కె.నౌపడలో ఎకరా రూ.26లక్షలు వెచ్చించి అవసరమైన భూమిని కొనుగోలు చేసి సిద్ధం చేసింది. మొత్తంగా భావనపాడు పోర్టు కోసం 675.60ఎకరాలను సేకరించింది. ఇందులో ప్రైవేటు భూములు 433.71ఎకరాలు కాగా, ప్రభుత్వ భూమి, కోస్టల్ తీరం కలిపి 241.89ఎకరాలు ఉన్నాయి. రూ.3200కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్న భావనపాడుకు త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.



మూలపేటవాసులకు పరిహారం అందజేస్తున్న మంత్రులు ధర్మాన, సీదిరి తదితరులు (ఫైల్)

తూర్పు తీరంలో ఉత్తరాంధ్రలో ప్రస్తుతం విశాఖపట్టణం పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. టెక్కలిలో ప్రపంచ ప్రఖ్యాత నీలి గ్రానైట్ తదితర ఖనిజాలు లభ్యమవుతున్నాయి. ఈ గ్రానైట్‌ను అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ చేసేందుకు భావనపాడు పోర్టు ఉపయోగపడుతుంది. అదే విధంగా జిల్లాలో విస్తారమైన 193 కిలోమీటర్ల తీర ప్రాంతంలో సరాసరి లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద లభిస్తోంది. ఈ విధంగా ఒకవైపు మత్స్య సంపదకు మంచి మార్కెట్ కల్పించేందుకు పోర్టు ఉపయోగపడుతుంది. ఉక్కు తయారీ కంపెనీలకు కావాల్సిన బొగ్గు, ముడి ఇనుము ఎగుమతి, దిగుమతులకు, మత్స్య ఎగుమతులకు భావనపాడు ఓడరేవు వినియోగమవుతోంది.

అడుగడుగునా అడ్డంకులు..

భావనపాడు పోర్టుకు మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులు అనుకూలంగా ఉన్నారు. భూ సర్వేకు, ఇళ్ల కొలతలన్నీ గ్రామస్తుల అభిప్రాయం మేరకే జరిగాయి. పోర్టుకు అందరు అనుకూలమని చెప్పినప్పటికీ అచ్చెన్నాయుడు డైరెక్షన్‌లో కొందరు అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేశారు. జిల్లాకు మేలు జరిగి, అభివృద్ధికి దోహదపడే భావనపాడు పోర్టు పూర్తయితే తమకెక్కడ పుట్టగతులుండవని కుట్రపూరితంగా వ్యవహరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వారి కుట్రలను ఛేదించి, పన్నాగాలను తిప్పికొట్టి భూసేకరణ పూర్తి చేసింది.

జరిగిన మేలు..

- 2018 నవంబర్ 27న పాకిస్తాన్ భద్రతా దళాలకు వీరావల్‌లో సముద్ర వేటలో ఉత్తరాంధ్రకు చెందిన మత్స్యకారులు పట్టుబడ్డారు. వీరు 13 నెలలు పాకిస్తాన్ కరాచీ జైలులో గడిపారు. పాక్ జైల్లో ఉన్న 20మంది మత్స్యకారుల విడుదల కోసం గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక మార్లు కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జై శంకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ మంతనాలు ఫలించి 2020 జనవరి 6న 20మంది విడుదలయ్యారు.



- కరోనా వైరస్ వ్యాప్తి కట్టడి కోసం కేంద్రం లాక్‌డౌన్ అమలు చేసినప్పుడు జిల్లాకు చెందిన మత్స్యకారులు గుజరాత్‌లో చిక్కుకున్నారు. రూ.3కోట్లు ఖర్చుపెట్టి జిల్లాకు చెందిన 3064 మంది మత్స్యకారులను 46 బస్సుల ద్వారా తీసుకొచ్చారు.

● అంబరాన్నంటిన సంబరం



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులతో పాటు విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ముగ్గులు, భోగి మంటలు, హరిదాసుల వేషధారణలు అలరించాయి. –నరసన్నపేట

తోటి మహిళలకు చేదోడువాదోడుగా ఉందాం: ఎస్పీ



వీడియో కాన్ఫరెన్సులో మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : మంచి పనులు చేయడానికి భయపడకూడదని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా తోటి మహిళలకు చేదోడువాదోడుగా ఉందామని జిల్లాలోని మహిళా పోలీసులకు ఎస్పీ జీఆర్ రాధిక దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళా పోలీసుల విధివిధానాలు, ప్రజా రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. గ్రామాల్లోని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. దిశ యాప్, మహిళలపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, సైబర్ నేరాల వంటి వాటిపై గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కల్పించాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటేనే వారికి నమ్మకం కలుగుతుందని చెప్పారు. వీసీలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ టి.పి. విఠలేశ్వరరావు, సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు, వారి వారి కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల నుంచి పాల్గొన్నారు.

ఉద్దానంకు జగనన్న అండ

- లోహరిబంద సభలో మంత్రులు రజిని, అప్పలరాజు
- హరిపురం డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన మంత్రులు



లోహరిబందలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని. చిత్రంలో మంత్రి సీదిరి తదితరులు

మందస: ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీవ్యాధి బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి విడదల రజిని, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లోహరిబందలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తక్షణమే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కిడ్నీవ్యాధిపై దృష్టి సారించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చారన్నారు. రూ.5వేలు, రూ.10వేల పింఛన్లు అందిస్తున్నామని, ఆరోగ్య శ్రీలో కూడా చికిత్స చేస్తున్నామని చెప్పారు. కిడ్నీమార్పిడి చేయించుకున్న వారికి కూడా జీవితాంతం పెన్షన్ అందజేస్తున్నామన్నారు.

దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యను సమూలంగా పరిష్కరించడానికే సూపర్ స్పెషాలిటీ, కిడ్నీరీసెర్చ్ కేంద్రం, ఇంటింటికీ శుద్ధజలం ప్రాజెక్టు పనులు చేస్తున్నామన్నారు. కిడ్నీ వ్యాధి గురించి ముందుగానే పరీక్షించుకుని తెలుసుకుంటే జీవిత కాలం పెరుగుతుందన్నారు. హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని మంత్రులు పరిశీలించారు. డయాలసిస్ కేంద్రం నిర్వాహకులతో మాట్లాడు తూ రోగులకు అందిస్తున్న మందులు, రక్తమార్పిడి, ఇంజెక్షన్లు, ఎంతమంది డయాలసిస్ చేయించుకుంటున్నారు వంటి విషయాలపై ఆరా తీశారు. మంత్రులకు లోహరిబంద, హరిపురంలో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, హనుమంతు వెంకటరావు, ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, జెడ్పీ వైఎస్ చైర్మన్ పాలీన శ్రావణి, సర్పంచ్‌లు రాపాక శేషగిరి, జె.పురుషోత్తం, గుసిరి వెంకటరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరి, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాౖర ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



హరిపురం డయాలసిస్ కేంద్రం రోగులతో మాట్లాడుతున్న మంత్రులు రజిని, అప్పలరాజు

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన

కాశీబుగ్గ: పలాసలో నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి సాయంత్రం నాలుగు గంటలకు పరిశీలన చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిబడ్జెట్‌లో రూ.50 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఐదు అంతస్తుల్లో పది బ్లాకులతో నిర్మాణం జరుగుతుండగా.. మొదటి అంతస్తుకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ బ్లాక్‌లో ఏముంటుందో, ఏ సేవలు అందనున్నాయనే విషయాలపై చర్చించారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, ఇతర వివరాలను తెలుసుకున్నారు.

బతుకు బాట చూపారు



సుమారు పదేళ్ల నుంచి కిడ్నీవ్యాధితో బాధ పడుతున్నాను. ఒకప్పుడు డయాలసిస్‌కు వెళ్లడానికి ఎంతో ఇబ్బంది పడేవాడిని. వ్యయంతో కూడిన వైద్యం కావడంతో ఆత్మక్షోభకు గురయ్యాను. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారంతో బతుకుపై ఆశ కలిగింది. ఉచితంగా డయాలసిస్‌తో పాటు రూ.10వేలు పింఛన్ పొందుతున్నాను. హరిపురం ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకోవడానికి 108 వాహనంలోనే వెళ్తున్నాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– నర్తు సీతారాం, గొల్లలపాలేం, డయాలసిస్ పేషెంట్

ఆత్మహత్య చేసుకోవాలనిపించింది



కిడ్నీవ్యాధి సోకి డయాలసిస్ వరకు వచ్చింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. చికిత్స ఆర్థికంగా భారమైంది. నా భార్యకు కూడా కిడ్నీ వ్యాధి సోకింది. ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కిడ్నీవ్యాధిపై తీసుకున్న చర్యలు నన్ను, నా కుటుంబాన్ని ఆదుకున్నాయి. పింఛన్లు వస్తున్నాయి. ఉచితంగా డయాలసిస్ జరుగుతోంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– రాపాక అప్పలస్వామి, గొల్లమాకన్నపల్లి, డయాలసిస్ పేషెంట్

క్లుప్తంగా

గెడ్డలో వృద్ధుడి మృతదేహం

పోలాకి: మండలంలోని కొల్లివలస వద్ద వంశధార కాలువ(పోలాకి గెడ్డ)లో మంగళవారం ఉదయం వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు రోజులుగా కనిపించకుండాపోయిన రాళ్లపాడుకు చెందిన పల్లి లచ్చయ్యగా గుర్తించారు. లచ్చయ్యకు మతిస్థిమితం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఎస్‌ఐ నర్సింహమూర్తి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

బాలికల వసతి గృహం తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మరుగుదొడ్లు పరిశుభ్రం చేయడానికి విద్యార్థుల నుంచి వార్డెన్ డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడంతో నిజ నిర్ధారణ కోసం సబ్ కలెక్టర్ విచారణ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు.

గద్దర్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న కళాకారులు

పలాస: సిక్కోలు జానపద కళావేదిక ఆధ్వర్యంలో పలాస మండలం చిన్న నీలావతి గ్రామంలో బుధవారం జరగనున్న జానపద కళాజాతరలో పాల్గొనేందుకు ప్రజా గాయకుడు, యుద్ధనౌక గద్దర్ మంగళవారం పలాస చేరుకున్నారు. జానపద , సినీ నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, ఉద్దాన ప్రాంత జానపద కళాకారులు రాపాక ధనరాజు, మల్లేన దేవరాజు, కుత్తుం వినోద్, మామిడి కృష్ణారావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని, కళాభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

హోంగార్డుకు చేయూత



అప్పారావుకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు తోటిహోంగార్డులు తమ ఒక్కరోజు గౌరవ వేతనాన్ని ఆర్థిక సాయంగా అందించారు. శ్రీకాకుళం యూనిట్‌లో హోంగార్డుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఎన్.అప్పారావుకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రూ.4.32 లక్షల చెక్కును ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ నుంచి ఎటువంటి సహాయం కావాలన్నా అండగా ఉంటామని, ఆరోగ్యం కాపాడుకోవాలని భరోసా అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్‌ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సీఐటీయూ మహాసభలు

ఎచ్చెర్ల క్యాంపస్: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలు విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం అరిణాం అక్కివలసలోని శ్యాం క్రగ్ పిస్టన్ పరిశ్రమ ఆవరణలో సీఐటీయూ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోందని దుయ్యబట్టారు. లేబర్ చట్టాలు పక్కాగా అమలు కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



హనుమంతు లజపతిరాయ్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది మూడు రాజధానులను కాదని, మూడు ప్రాంతాల అభివృద్ధిని అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్సలర్, రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. ఎచ్చెర్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రభుత్వ ప్రకటించిన అమరావతి అభివృద్ధి చెందాలంటే రాష్ట్రం మొత్తం ఆదాయం 30 ఏళ్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అప్పుడు అభివృద్ధి నిలిచిపోయి చిన్న రాష్ట్రాల ఉద్యమాలు పుట్టుకొస్తాయని చెప్పారు. రాజధాని ప్రగతి కోసం మిగతా ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకోవటం సరికాదన్నారు. విశాఖపట్నానికి పాలనా రాజధానిగా అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు.

• వలకు చిక్కిన కొండచిలువ



ఎల్.ఎన్.పేట మండలం కొమ్మువలస సమీపంలో అప్పలనాయుడు చెరువులో మంగళవారం కోరాడ వెంకటరావు అనే వ్యక్తి చేపల వేట సాగిస్తున్న సమయంలో వలకు భారీ కొండచిలువ చిక్కింది. ముందు బరువుగా ఉండటంతో పెద్ద చేపలు చిక్కాయని సంతోషపడ్డానని, తీరా ఒడ్డుకు తీసుకొచ్చి చూడగా కొండ చిలువ ఉండటంతో సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో విడిచిపెట్టామని వెంకటరావు తెలిపారు.

- ఎల్.ఎన్.పేట

•పండగొచ్చిన వేళ..



సంక్రాంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. హరిదాసులు ఇంటింటా తిరుగుతూ హరినామ సంకీర్తనలు వినిపిస్తున్నారు. ధనుర్మాసం నెలరోజులూ శ్రీమహా విష్ణువులా అక్షయ పాత్రను తలపై ధరించి, ఓ చేతిలో చిడతలు, మరో చేతిలో తంబూరతో ఊరూర తిరుగుతూ సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడుతున్నారు హరిదాసులు. మంగళవారం సన్యాసిపుట్టుగకు చెందిన హరిదాసు పలు సంకీర్తనలు వినిపించారు.

- ఇచ్ఛాపురం రూరల్

•'కొంగొ'త్త అందాలు



వరి కోతలు దాదాపు పూర్తయ్యాయి. వరి నూర్పులు అవుతున్న తరుణంలో కుప్పలు కల్లాలకు చేర్చుతున్న సమయాన పొలాల్లో వరి ఓవులు పైన కొంగలు ఆహారం కోసం గుంపులు గుంపులుగా చేరి మిడతలను తింటున్నాయి. భారీగా చేరిన కొంగలతో పొలాలు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి.

- జలుమూరు

నిజాయితీగా పనిచేస్తుంటే ఆరోపణలా?

● మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిజాయితీగా పని చేస్తున్నా తనపై ఆరోపణలు చేస్తున్నారని, ఈనాడు పేపర్‌లాంటిది తనకూ ఉంటే తానూ రాయగలనని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. శ్రీకాకుళం నగరంలోని ఎల్బీఎస్ కాలనీ, పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో రహదారులను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. అభివృద్ధి జరగడం లేదంటున్న ప్రతిపక్షాలు ఒక్కసారి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. తాను భూములు కొల్లగొట్టానని ఈనాడు పత్రిక పదేపదే రాస్తోందని, నిజానికి తనకు భూములు కేటాయించే హక్కు గానీ అధికారం గానీ లేవని, ఏదైనా కేటాయింపులు చేయాలంటే అది క్యాబినెట్ నిర్ణయానుసారం జరుగుతుందని స్పష్టం చేశారు. రాజధాని విషయమై ఇప్పటికే స్పష్టత ఇచ్చామన్నారు. అమరావతి కేంద్రంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటామంటే తామెలా ఒప్పుకుంటామని ప్రశ్నించారు. ఇన్నేళ్ల తరువాత విశాఖ కేంద్రంగా రాజధాని ఏర్పాటుకు అవకాశం దక్కిందని, దీనికి మద్దతుగా మాట్లాడుతున్నందున భూములు కొట్టేశానని అర్థరహిత అభియోగాలు చేస్తున్నారని మండిపడ్డారు. అయినా ఇక్కడి ప్రాంత ప్రయోజనాల కోసం గొంతెత్తక మానలేనని పునరుద్ఘాటించారు. అమరావతి నుంచి అరసవల్లి వరకూ రాజధాని రైతుల పాదయాత్రకు వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు ఈనాడు, ఆంధ్రజ్యోతికి విలన్‌గా కనిపించానని, అమరావతికి జై కొడితే వాళ్లకు గొప్పవాడిలా కనిపిస్తానని మంత్రి పేర్కొన్నారు. మీరు అమరావతి కేంద్రంగా రాజధాని పెట్టుకుంటామంటే మా రాష్ట్రం విశాఖ కేంద్రంగా మాకు ఇవ్వాలి అని డిమాండ్ చేశానని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోతే నష్టపోయినందుకు పరిహారంగా 23 సంస్థలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో ఒక్కటి కూడా జిల్లాలో నెలకొల్పలేదన్నారు. అప్పట్లో ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చంద్రబాబు తన ఎదుటకు వస్తే ఆయన ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారో రుజువు చేస్తానని ప్రకటించారు.

40 ఏళ్ల తర్వాత..



వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–83 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటూరు సముద్ర తీరంలో మంగళవారం మళ్లీ కలిశారు. సహపంక్తి భోజనాలు చేసి స్కూలు జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1877 కోట్లు



బడ్జెట్ ఆమోదంపై మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ. చిత్రంలో సీఈఓ వెంకట్రామన్

● 2023–24 సంవత్సరానికి గాను సభ్యుల ఆమోద తీర్మానం

● జెడ్పీ ఆదాయంపై దృష్టి పెట్టాలన్న చైర్‌పర్సన్ పిరియా విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ ఆదాయ, వ్యయాల ఆధారంగా 2022–23 సవరణ బడ్జెట్, 2023–24 అంచనా బడ్జెట్ ప్రతిపాదనలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. జెడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ సమావేశమ మందిరంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ సమక్షంలో అధికారులు జిల్లా పరిషత్ బడ్జెట్ ప్రతిని సమావేశంలో చదివి వినిపించారు. 2022–23 సవరణ బడ్జెట్ ఆదాయం రూ.1757,90,78,896 కాగా, వ్యయం రూ. 1611,58,61,942 గానూ మిగులు రూ.146,32,16,954గా పేర్కొన్నారు. 2023–24 గాను అంచనా బడ్జెట్‌గా ఆదాయం రూ.1877, 04,59,662 కాగా, వ్యయం రూ.1744,76,41,027, మిగులుగా రూ.132,28,18,635గా చూపించి ప్రతిపాదించారు. అంచనా బడ్జెట్‌లపై ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో సుమారు 20 మంది జెడ్పీటీసీలు ఆమోదం తెలియజేశారు. దీంతో 2023–24 అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర ఐదు విభాగాలతో పాటు జిల్లా పరిషత్‌కు వస్తున్న ఆదాయ, వ్యయాలను అంచనాలు వేసి బడ్జెట్‌ను రూపొందించినట్లు సీఈఓ తెలిపారు. కేవలం జెడ్పీకి సీనరేజీ ఫీజు, సర్‌చార్జి ఆన్ స్టాంప్ డ్యూటీ, రూ.4 చొప్పున తలసరి ఆదాయంతో పాటు అద్దెలు–ఇతరత్రా మార్గాల ద్వారా సకాలంలో జెడ్పీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాలని చైర్‌పర్సన్ సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు 1వ జెడ్పీ స్థాయి సంఘ సమావేశం కూడా చైర్‌పర్సన్ అధ్యక్షతన ముగిసింది.

'చిత్తడి నేలను పరిరక్షించాలి'



బీల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం

సోంపేట: సోంపేట మండలంలోని బీల ప్రాంతంలో ఉన్న విశిష్టమైన చిత్తడి నేలలను కాపాడాలని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, సంఘ ప్రతినిధులు గ్రీన్ ట్రిబ్యునల్ కమిటీ సభ్యులను కోరారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్‌లో సోంపేట బీల ప్రాంతాన్ని చిత్తడి నేలలుగా గుర్తించాలని సోంపేట పర్యావరణ పరిరక్షణ సమితికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ జాయింట్ కార్యదర్శి సుజిత్ బాజ్‌పేయి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రీన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం బీల ప్రాంతంలో మంగళవారం పర్యటించింది. బృంద సభ్యులు మండలంలోని పలాసపురం, రామయ్యపట్నం, గొల్లగండి గ్రామాల్లోని చిత్తడి నేలలు పరిశీలించి, వాస్తవిక పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి బీల ప్రాంత విశిష్టతను చిత్రపటం ద్వారా వివరించారు. ఇక్కడ జరిగిన పోరాటాల గురించి వారికి చెప్పారు. రైతులు ననపల శ్రీరామమూర్తి, బార్ల సుందరరావు తదితరులు మాట్లాడుతూ రైతులకు కలుగుతున్న ప్రయోజనాలు, ఇక్కడి జీవ వైవిధ్యం గురించి తెలిపారు. బృందసభ్యులు సుజిత్ బాజ్‌పేయ్ మాట్లాడుతూ వాస్తవిక పరిస్థితులు గుర్తించామని, ఇవి చిత్తడి నేలలేనని తెలిపారు. నివేదికను కోర్టుకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌ఎస్ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు, ఎంఓఈఎఫ్‌సీసీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ రట్టి, శాఖాన్‌కు చెందిన శాస్త్రవేత్త రాజ్ జయపాల్, సౌమ్య, జేసీ ఎం.నవీన్, ఆర్డీఓ టి.సీతారామమూర్తి, తహసీల్దార్ ఎన్.రమేష్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



శివకుమార్(ఫైల్)

సరుబుజ్జిలి: కొత్తకోట గ్రామానికి చెందిన డోల శివకుమార్ రెండు రోజులుగా కనిపించడం లేదని తల్లి డోల సత్యవతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో కూరగాయల షాపు నిర్వహించే శివకుమార్ ఎప్పటిలాగే ఈ నెల 9న ఉదయం 9 గంటల ప్రాంతంలో కూరగాయల కొనుగోలుకు బయటకు వెళ్లారు. పండగ దుస్తుల కొనుగోలుకు సిద్ధంగా ఉండమని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. సాయంత్రం గడచినా ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో పరిసరాలు ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. అయినా ఫలితం రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. శివకుమార్‌కు వివాహం కాగా, ఓ కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8790832825 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

సభావేదికను పరిశీలించిన ఎస్పీ



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

లావేరు: మండలంలోని తాళ్లవలస వద్ద ఈ నెల 12న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరగనున్న యువశక్తి సభాస్థలిని ఎస్పీ జి.ఆర్.రాధిక మంగళవారం పరిశీలించారు. సభావేదిక, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీ మహేంద్ర పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఏటీఎం చోరులు?

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో పలుచోట్ల బ్యాంకు ఏటీఎం కేంద్రాలను సాంకేతికంగా మిస్ యూజ్ చేసి రూ.65 లక్షలు దోచుకెళ్లిన ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌ను శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. శ్రీకాకుళం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి ఏటీఎంలో గత సంవత్సరం జూలై నుంచి నవంబరు వరకు సొమ్ము మాయమవుతున్నట్లు మేనేజర్ గుర్తించి ఒకటి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పలుచోట్ల జరిగి సుమారు రూ.65 లక్షల మేర నగదు మాయమైంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌కు చెందిన నలుగురు చోరులు వారి గ్యాంగ్‌తో కలిసి ఏటీఎం కేంద్రాల్లో ఈ మోసాలకు పాల్పడినట్లు తెలిసింది.

డయల్ యువర్ జేసీకి 30 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో మంగళవారంపౌర సరఫరాల సంస్థ మేనేజర్ పి.జయంతి, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ ఆధ్వర్యంలో డయల్ యువర్ జేసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను ఫోన్ ద్వారా వివరించారు. ధాన్యం కొనుగోలులో తలెత్తిన ఇబ్బందులను వివరించగా, పరిష్కారానికి అధికారులు సూచనలు అందించారు.

'ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న కేంద్రం'



చిలకమ్మ స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


మందస: ఆదివాసీల ఆశాజ్యోతి సవర చిలకమ్మ అలియాస్ మంత్రిబుడి అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మందస మండలం కొండలోగాంలో మంగళవారం చిలకమ్మ 28వ వర్ధంతి నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు గౌరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరక్ష్యరాస్య గిరిజన కుటుంబంలో జన్మించిన మంత్రిబుడి గిరిజనుల్లో చైతన్యం తీసుకువచ్చిందన్నారు. ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి అమరురాలైనట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం ఆదివాసీ హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని, 1/7చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాలు పోడుభూములు అందినప్పుడే చిలకమ్మకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థూపం వద్ద సవర దాశరథి పతాకావిష్కరణ చేయగా, ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, జగన్, వినోద్, కూర్మారావు, రామారావు, సోమేశ్, హేమావతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజను కొంటాం

● మిల్లర్లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో తలెత్తుతున్న సమస్యలను జిల్లా రైస్‌మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రైతులు, మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సమక్షంలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి కనుమూరి వెంకట నాగేశ్వరరావు, అధికారులతో ధర్మాన ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ధర్మాన మాట్లాడుతూ రైతులు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 4.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంతో పాటు అదనంగా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆదేశాలు వచ్చాయని ప్రకటించారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మాట్లాడుతున్న మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన మొత్తం ధాన్యం, ముందుగా నిర్దేశించిన లక్ష్యాలకు మించి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోషియేషన్ కార్యదర్శి, జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డి విజయశ్రీ వెంకటేశ్వరరావు (వాసు) అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 9.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాలు వేశారని, ప్రభుత్వం మాత్రం 4.5 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు లక్ష్యంగా తీసుకుందని చెప్పారు. మిగిలిన ధాన్యం కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావును కలవగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. మంత్రి నాగేశ్వరరావుతో పాటు సివిల్ సప్లయ్ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండియన్‌లతో మాట్లాడి జిల్లాలో పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తంగుడు జోగారావు, వైస్ ప్రెసిడెంట్ ముద్దాడ సూర్యనారాయణ, పీఆర్‌ఓ లాడి రమేష్, జాయింట్ సెక్రటరీ తంగుడు నాగేశ్వరరావు, కోరాడ శంకర్‌కుమార్, రుగడ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

1.30 లక్షల టన్నుల సీఎంఆర్ రైస్ సేకరణకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత ఆహార సంస్థ ద్వారా ఈ ఏడాది 1,30,000 టన్నుల ఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఎఫ్‌సీఐ మేనేజర్ వై.సునీల్‌కుమార్ మంగళవారం తెలిపారు. గతంలో మాదిరిగా సాధారణ రైస్ కాకుండా పూర్తిగా పోర్టుఫైడ్ రైస్‌ను మాత్రమే సేకరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు కృషి చేస్తున్నామని, సీఎంఆర్ రైస్ కొనుగోలుకు సంబంధించి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్ అధికారులు లక్ష్యాల మేర బియ్యం దజేయాల్సి ఉంటుందని తెలిపారు. గత ఏడాది 40 వేల టన్నులు లక్ష్యంగా కాగా ఆ స్థాయిలో సీఎంఆర్‌ను అందించలేదని, కేవలం 5వేల మెట్రిక్ టన్నులకే పరిమితమయ్యారని వివరించారు. ఇప్పటి వరకు 700 మెట్రిక్ టన్నులు బియ్యం అందించినట్లు ప్రకటించారు. అదనపు గోదాములు కోసం జేసీకి లేఖ రాశామన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ సివిల్ సప్ల హమాలీలకు కూలి రేట్లు పెంచాలని సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద ఏపీ సివిల్ సప్లయ్ హమాలీలు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గడువు ముగిసి మూడు నెలలైనా ఇప్పటి వరకు కూలీ రేటు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి రేట్లు పెంచడంతో పాటు పీఎఫ్, బోనస్ అందజేయాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225